ఇద్దరికి జైలు శిక్ష

ధర్పల్లి/ వినాయక్‌నగర్, ఫిబ్రవరి 18: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ధర్పల్లి ఎస్సై రామకృష్ణ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ధర్పల్లిలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఇందిరానగర్ తండాకు చెందిన మలావత్ సీతారాం మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. దీంతో అతడిని మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని ఎస్సై పేర్కొన్నారు. నిజామాబాద్ నగరంలోని ఒకటో ఠాణా ఏరియాలో ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. షేక్ తౌఫిక్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా.. రెండు రోజుల జైలు శిక్ష విధించారు. దీంతో అతడిని జైలుకు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

హత్య కేసు నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ధర్పల్లి, ఫిబ్రవరి 18: ధర్పల్లికి చెందిన అనూషను హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన జాన్కంపేట్ గ్రామానికి చెందిన వినోద్‌రెడ్డిని కఠినంగా శిక్షించి వారి ఇద్దరు కుమారులను ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) రూరల్ ఇన్‌చార్జి పెద్ది వెంకట్రాములు డిమాండ్ చేశారు. మంగళవారం ధర్పల్లికి విచ్చేసిన ఆయన సీపీఐ(ఎంఎల్) నాయకులతో కలిసి అనూష కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోలీసులు అనూష మృతిపై ఎఫ్ఐఆర్‌లో 194 సెక్షన్‌కు బదులు 304, 306 సెక్షన్లను పొందపర్చి నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని కోరారు. ఆయనవెంట నాయకులు శేఖర్‌గౌడ్, చంద్రకాంత్ ఉన్నారు.

సిరికొండలో ఆరోగ్యమేళా

సిరికొండ, ఫిబ్రవరి 18: సిరికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం ఆరోగ్యమేళా నిర్వహించారు. బీపీ, షుగర్, రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ

ఖిలీల్‌వాడి, ఫిబ్రవరి 18: రాష్ట్రస్థాయి తైక్వాండో -2025 పోటీలు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో విజయ్ హైస్కూల్‌లో చదువుతున్న ఎస్.రితేశ్ యాదవ్, బి.లాస్యప్రియ అండర్-14 విభాగంలో పాల్గొని రజత పతకాలు సాధించారు. దీంతో విద్యార్థులను స్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత అభినందించారు.

రెండు బైకులు ఢీ : ఇద్దరికి గాయాలు

ఇందల్వాయి, ఫిబ్రవరి 18: మండలంలోని చంద్రాయన్‌పల్లి శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం రెండు బైకులు ఢీకొని ఇద్దరికి గాయాలైనట్లు ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాయన్‌పల్లి సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేస్తున్న అశోక్ నిజామాబాద్ వెళ్తున్న సమయంలో కామారెడ్డి నుంచి బైక్‌పై వస్తున్న భరత్ వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించారు.

అదనపు కలెక్టర్‌పై ఫిర్యాదు

కంఠేశ్వర్, ఫిబ్రవరి 18: అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అంకిత్‌పై ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్యకు మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి దేవతి శ్రీనివాస్ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిబ్రవరి 6న ప్రస్తుత ఎమ్మెల్సీ అభ్యర్థి దళిత నాయకుడు దేవతి శ్రీనివాస్‌ను అదనపు కలెక్టర్ తన చాంబర్‌లో కుల వివక్షకు గురి చేశారన్నారు. అతడిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

- ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఏ.శరత్
- అధికారులతో సమీక్ష

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఏ.శరత్

కంఠేశ్వర్, ఫిబ్రవరి 18: ఎండాకాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్ అన్నారు. అధికారులు నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి జిల్లాలో మంచి నీటి సరఫరా పరిస్థితిపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమీక్ష నిర్వహించారు. గత ఏడాది జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా చూశారని అధికారులను అభినందించారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా పనిచేయాలని సూచించారు. నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. బోరు మోటర్లు రిపేరు చేసేందుకు మెకానిక్‌ను అందుబాటులో ఉంచుకోవాలని, సమాచారం అందిన గంటల వ్యవధిలో మోటరును రిపేరు చేయించాలని సూచించారు. అత్యవసరం అయితే గ్రామ పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. నీటి సరఫరాను పర్యవేక్షించాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాలతోపాటు ఆయా మండలాలకు తాగునీటిని అందించే జలాశయాల్లో సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. అన్ని మండలాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలతో కూడిన క్లస్టర్ బృందాలు నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించేలా చూస్తామన్నారు. నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులను క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉంచుతామని ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీయూలో పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీయూ వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 18:తెలంగాణ విశ్వవిద్యాలయంలోని క్రీడా విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ బీఆర్ నేత రచించిన 'ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు చేయాల్సిన శాస్త్రీయ సాధన' అనే పుస్తకాన్ని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ యాదగిరి రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఈ పుస్తకం వ్యాయామ విద్యను అభ్యసిస్తున్న వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఘంట చంద్రశేఖర్, అకాడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ డాక్టర్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు అంటే భయం వీడాలి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీహరి

కోటగిరి, ఫిబ్రవరి 18: పరీక్షలు అంటే భయం వీడాలని ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీహరి సూచించారు. కోటగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ వారి ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ప్రేరణ సదస్సు నిర్వహించారు. సదస్సులో మోటివేషనల్ స్పీకర్స్ నవీన్, నరహరి, అనిల్‌రెడ్డి, విఠలేశ్వర్ పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాగా చదువుకోవాలని, తల్లిదండ్రుల పట్ల విధేయత కలిగి ఉండాలని సూచించారు.

వీడీసీపై అట్రాసిటీ కేసు

వివరాలు సేకరిస్తున్న ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 18: గ్రామాభివృద్ధి కమిటీపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన సుంకరి స్రవంతి ఇంటి నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ నుంచి అనుమతి తీసుకున్నది. కానీ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల తీర్మానానికి వ్యతిరేకంగా ఇల్లు నిర్మించినందుకు బహిష్కరిస్తామని బెదిరించారు. ఇంటి స్లాబ్‌ను కూల్చేసి జరిమానా విధించడంతోపాటు కులం పేరుతో దూషించారు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకున్నారు. ఈ విషయమై ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి మంగళవారం ఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 18: గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులు పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షను నిర్వహించారు. ఇదివరకే పన్నుల వసూళ్లకు సంబంధించి డిమాండ్ నోటీసులు ఇవ్వడం పూర్తయ్యిందని, ప్రతిరోజూ ఉదయం గ్రామంలో తిరుగుతూ పన్ను వసూలు చేయాలని సూచించారు. తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో సూపరింటెండెంట్ నివేదితతో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అటవీ భూమి చదును చేస్తే కఠిన చర్యలు

ఫారెస్టు అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

సిరికొండ, ఫిబ్రవరి 18: అటవీ భూమిని అక్రమంగా చదును చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎఫ్ఆర్వో రవీంద్రరావు అన్నారు. మండలంలోని తాటిపల్లి గ్రామంలో అక్రమంగా చెట్లు నరికి చదును చేస్తున్నారని ఆ గ్రామ దళితులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఫారెస్టు భూమి చదును చేస్తున్న ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

యువకుడి ఆత్మహత్య

ఇందల్వాయి, ఫిబ్రవరి 18: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన గమ్ల శ్యామ్(23) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరా ప్రకారం.. శ్యామ్ గల్ఫ్ వెళ్లి కొన్ని నెలల క్రితం తిరిగి వచ్చాడు. కొన్ని రోజుల నుంచి మతిస్థిమితంగా లేకుండా ప్రవర్తిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి పోశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు.

యువతకు స్ఫూర్తి ఛత్రపతి

శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శబ్ద తరంగణి సంస్థ బాధ్యులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 18: ఛత్రపతి శివాజీ మహరాజ్ యువతకు స్ఫూర్తి ప్రదాత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. నగరంలోని సరస్వతీనగర్‌లో శబ్ద తరంగణి సంస్థ ఆధ్వర్యంలో శివాజీ మహరాజ్ జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించడానికి శివాజీ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో షేర్ల దయానంద్, దాత్రిక రమేశ్, గుర్రం ప్రకాశ్‌గౌడ్, గడ్డం ధీరజ్ రెడ్డి, తొగర్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ఆవిష్కరణ..

నగర శివారులోని బోర్గా(పీ) చౌరస్తాలో నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మహరాజ్ కాంస్య విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించనున్నట్లు ఛత్రపతి శివాజీ మహరాజ్ సేవా సమితి ఇందూరు జిల్లా ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీ యువసేనా ఆధ్వర్యంలో కుమార్‌గల్లీలో మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని, సాయంత్రం 4:30గంటలకు కుమార్‌గల్లీ దుర్గామాత ఆలయం నుంచి ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శివాజీ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

మైనార్టీ కళాశాల తనిఖీ

విద్యార్థుల కోసం వండిన అన్నం పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి, ఫిబ్రవరి 18: కోటగిరిలోని తెలంగాణ మైనార్టీ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కళాశాల విద్యార్థులకు అందించే భోజనాన్ని తనిఖీ చేశారు. వంట గదితో పాటు కూరగాయలు పరిశీలించారు. వంట పాత్రలు, కిచెన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట ఎంపీవో చందర్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ లీగల్‌సెల్ అథారిటీ ప్రతినిధి రమణ

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 18: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ముఖ్యంగా మహిళలు, బాలికల చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని డిస్ట్రిక్ట్ లీగల్‌సెల్ అథారిటీ ప్రతినిధులు పీవీ రమణ, టి.పద్మాసింగ్ సూచించారు. బోధన్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు మంగళవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పద్మాసింగ్ మాట్లాడుతూ.. 18 ఏండ్ల లోపు బాలికల వివాహానికి అనుమతించరాదని అన్నారు. ఇది చట్టవ్యతిరేకమని ఆమె పేర్కొన్నారు. బాల్య వివాహ నిరోధక చట్టం 2006 ప్రకారం బాల్య వివాహాన్ని నిర్వహించిన వారు, సహకరించిన వ్యక్తులు శిక్షకు గురవుతారని తెలిపారు. పిల్లల సంరక్షణ ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. బాల కార్మికులను పనుల్లో పెట్టినా, వారిచేత పనులు చేయించినా శిక్ష అనుభవించాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ముందుగా వారు కళాశాలలో వివిధ అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి18: పట్టణంలోని ఏరియా దవాఖానలో డివిజన్ స్థాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సూపర్‌వైజర్లతో డీఎంహెచ్‌వో రాజశ్రీ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైద్యులకు సీజనల్ వ్యాధులు, ఫైలేరియాపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో కాన్పుల సంఖ్య పెంచాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వైద్యాధికారులు సమయపాలన పాటించాలని, లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దవాఖాన పరిసరాలు శుభ్రంగా ఉండేలా సిబ్బంది చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్, వైద్యులు పాల్గొన్నారు.

పాఠశాల, దవాఖాన తనిఖీ

ఏర్గట్ల, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానతోపాటు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను డీఎల్‌పీవో శివకృష్ణ మంగళవారం తనిఖీ చేశారు. ప్రభుత్వ దవాఖానలో రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు, దవాఖానలో నెలకొన్న సమస్యలను మండల వైద్యాధికారిణి రక్షితారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో నీటి సమస్య ఉన్నదని వైద్యురాలు చెప్పగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పీఎల్‌పీవో అన్నారు. అనంతరం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో శివచరణ్, పంచాయతీ కార్యదర్శి జాకీర్, పాఠశాల గెజిటెడ్ హెచ్ఎం కోమరగిరి కృష్ణాచారి తదితరులు ఉన్నారు.

ఆహార పదార్థాల కల్తీపై అప్రమత్తంగా ఉండాలి

అవగాహన కల్పిస్తున్న వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి

బోధన్, ఫిబ్రవరి 18: నిత్యం మనం వినియోగిస్తున్న ఆహార పదార్థాల కల్తీపై ప్రజలు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని గోసం బస్తీతో పాటు పలు ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార వస్తువులు, పాలలో కల్తీపై ఆయన అవగాహన కల్పించారు. నిత్యం వినియోగించే ఉప్పు, పప్పులు, వంటనూనెలు మొదలుకొని అన్ని రకాల వస్తువులను ప్లాస్టిక్ సంచుల్లో తీసుకుని వెళ్తున్నామని, వీటిద్వారా మైక్రోప్లాస్టిక్ కడుపులోకి చేరి క్యాన్సర్‌కు కారణంగా మారుతున్నదని అన్నారు. ప్లాస్టిక్ కవర్లలో ప్యాకింగ్ కారణంగా అయోడిన్ ఉప్పు లక్ష్యం నిర్వీర్యంగా మారుతున్నదన్నారు. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం 2013 నిబంధన ప్రకారం ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేస్తే, సదరు ప్లాస్టిక్ కవర్లపై ప్లాస్టిక్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రమాణాలు ముద్రించి ఉండాలన్నారు. అయోడిన్ ఉప్పు తయారీ సంస్థలు నాసిరకం ప్లాస్టిక్ కవర్లలో ఉప్పు ప్యాక్ చేస్తున్నాయని, దీంతో ప్రజలకు క్యాన్సర్ సోకే అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం వినియోగించే ఆహార పదార్థాల్లో కల్తీతోపాటు ప్లాస్టిక్ నివారణకు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వినియోగదారుల మండలి జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు వీఎన్ వర్మ, ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్, బోధన్ అధ్యక్ష, కార్యదర్శులు మారోజు సుధాకర్ చారి, ఎస్.అశోక్ చారి, ఐసీడీఎస్ సీడీపీవో జానకి, సూపర్‌వైజర్ రాధికా రాథోడ్, టీచర్ సరోజ, అంగన్‌వాడీ చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

భ్రూణహత్యలు చట్టరీత్యా నేరం

విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఏసీడీపీవో

మోర్తాడ్, ఫిబ్రవరి 18: భ్రూణహత్యలు చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలను సంరక్షించుకుందాం, వారిని చదివించుకుందామని, మహిళలు పురుషులతో సమానమని ఐసీడీఎస్ భీమ్‌గల్ ప్రాజెక్ట్ ఏసీడీపీవో జ్ఞానేశ్వరి అన్నారు. బేటీ బచావో..బేటీ పడావో కార్యక్రమం పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మోర్తాడ్ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఆడపిల్లలు వద్దనుకుని శిశు, భ్రూణహత్యలకు పాల్పడున్న సంఘటనలు వింటున్నామని, ఇవి చట్టరీత్యా నేరమని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గుదలకు కారణమేంటో వివరించారు. ఇకముందు ఆడిపిల్లల లింగనిష్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను ప్రాజెక్టర్ ద్వారా చూపించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మంజుల, సౌమ్య, సునీత, ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, గణశారద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం

ఏర్గట్ల, ఫిబ్రవరి 18: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు ఆంగ్లంపై వ్యాస రచన, పాటలు, నాటికలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కోమరగిరి కృష్ణాచారి మాట్లాడుతూ.. భారత కోకిల, నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పేరుపొందిన సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెంటాకలాన్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

అమ్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ..

ఘనంగా పాఠశాలల వార్షికోత్సవం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 18: బోధన్ మండలంలోని పెంటాకలాన్, అమ్దాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి మంచి విజయాలు సాధించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుతూ ఉత్తీర్ణత సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అబ్బయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, ఉపాధ్యాయుడు పాటల శ్రీనివాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

దీపారాధనకు నూనె పంపిణీ

దీపారాధనకు నూనె పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 18: బోధన్ పట్టణ శివారులోని నర్సాపూర్ దివ్య సంజీవనీ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పలు దేవాలయాల్లో దీపారాధనకు నూనె పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు, చిలుకూరు శివాలయ ప్రధాన అర్చకుడు శ్రీరామదాసి సురేశ్ ఆత్మారాం మహరాజ్ రెండేండ్ల నుంచి దేవాదాయశాఖ పరిధిలో లేని వివిధ ప్రాంతాల ఆలయాల్లో దీపారాధనకు నూనె పంపిణీ చేస్తున్నారు. ఆయన పంపిన నూనెను ప్రజాప్రతినిధులు ఎం.ఎల్లయ్య యాదవ్, గంగాప్రసాద్‌తో పాటు పలువురి చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు అభిషేక్ శర్మ, ఆలయ ప్రతినిధులు నర్సింగ్‌రావు, పంపరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి18: ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆర్మూర్ సబ్ డివిజన్ కార్యదర్శి సూర్య శివాజీ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయాలంటూ ఈనెల 20న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

నవీపేట, ఫిబ్రవరి 18: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని డ్రంకెన్ డ్రైవ్ కేసులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. నవీపేటకు చెందిన మహ్మద్ నబి సాబ్, అబ్బాపూర్(బి) గ్రామానికి చెందిన బాబు, నిర్మల్ జిల్లా కుబీర్‌కు చెందిన ఇసాల రాకేశ